ఆకలికోసం ఒళ్ళమ్ముకునే ఆమె పడకగదిలో ఎందరికో భార్యయి పోయింది కానీ ఎవరికీ అమ్మ కాలేకపోయింది.

"అమ్మా...." మరోసారి పిలిచాడు నానీ "అన్నం పెట్టమ్మా!"

"అమ్మా!" ఇంకోసారి....

"అమ్మా...."

ఎవరు తండ్రీ నువ్వు? ఎవరి కొండవి? ఏతల్లి పొత్తిళ్ళనుంచి జారిపడిన చిట్టి తండ్రివి?

అప్పటికే ఆమె నానీని సమీపించింది.

వీధి లైటు కాంతిలో చూసింది. అర్చన లేక మకిలిపట్టిన దేవుడిలా కనిపించాడు నానీ.

మనస్సు ద్రవించింది.... ఒక ఉదుటున ఉన్మాదిలా అక్కున చేర్చుకోబోయింది. కాని మళ్ళీ అంతలోనే ఆగిపోయింది.

"పిచ్చి గీతల నా తలరాతను అరక్షణం పాటైనా మార్చే ప్రయత్నంగా నా యింటి ముంగిట నిలిచిన ఓ బాలబ్రహ్మా! ఒక లిప్తపాటు నీకు అమ్మనయి ఒడిలోకి లాక్కోవాలని వున్నా యిది మైలపడిన దేహమని సంకోచిసున్నానయ్యా! ఎలా నిన్ను అక్కున చేర్చుకునేది?" ఆమె కళ్ళు నీటి కుండలు కాగా గుండె లోతుల్లోకి చూస్తున్న నానీని తాకలేకా వెనక్కి మరలలేకా వూగిపోతోంది.

ఆ కొద్దిపాటి ఆత్మీయతకేనా నోచుకోగలిగిన ఆనందమేమో నాని పెదవులు అస్పష్టంగా గొణుగుతున్నాయి.

"త్వమేవ మాతాచ"

తొలకరి జల్లుతో తడిసినట్టుందామేకు.

"పితాత్వమేవ...."

ఆ జల్లు ఆమె శిరోజాలను అభిషేకించి క్రిందకు దిగింది.

"సభాత్వమేవ...."

ఆ చినుకు పాలిండ్లవరకూ ప్రాకగా ముత్యపు చిప్పలా మారిపోయింద.

అంతే..... ఏ గుండె వాగుకి గండిపడిందో ఇక నిభాయించుకోలేనట్టు నానీనిని అమాంతం దగ్గరకు లాక్కుంది.

"అమ్మా.... ఆకలేస్తుందమ్మా-"

అమాంతం పైకెత్తుకుని లోపలికి తీసుకుపోయింది.

ఇప్పుడామెకి తన బ్రతుకేమిటో గుర్తుకు రావడంలేదు. ఇంతవరకూ ఎలా బ్రతికిందో జ్ఞప్తికి లేదు.

మంచంపై కూర్చోబెట్టింది. మరుక్షణం గిన్నెలో అన్నం ముద్దలుగా కలిపి తీసుకొచ్చింది. నేలపై కూర్చునే గోరుముద్దలు పెడుతుంటే ఆశగా తింటున్నాడు నానీ.

ఆమె కన్నీళ్ళను దాచుకోలేకపోతూంది.

“నేను పతితనైనా ఈ క్షణాన త్రిమూర్తులకు అడ్డాలలో అన్నం పెట్టిన అనసూయగా మారిపోయాను.”

ఆ చివరి పదమే విన్నాడు తిండి ధ్యాసలో - “నీ పేరు అనసూయా అమ్మా.”

“నీకెలా తెలుసు?” విస్మయంగా అడిగింది.

“నువ్వన్నావుగా అదన్నమాట” ఆకలి తీరిన ఉత్సాహం ఊత పదాన్ని జోడించింది.

“అన్నమాటేమిటి......”

“అమ్మ మాటన్న మాట”

“అస్సలు అర్థం కావటం లేదు.”

“అలా అన్నమాటంటుండేది అమ్మన్నమాట”

చీర చెరుగుతో నానీ పెదవుల్ని తుడుస్తూ అంది “గడుగ్గాయి!”

“అమ్మా అనేది అలాగే.”

“నిజం.... మరి ఆ అమ్మ ఎక్కడుంది?”

“ఉందా” చేతుల్ని తిప్పుతూ “లేదుగా” అన్నాడు.

“ఎక్కడి కెళ్ళింది?”

“పాపం చచ్చిపోయిందన్నమాట”

“ఎప్పుడు...” అప్రతిభురాలై అడిగింది.

“ఎప్పుడేంటీ నేను తలకొరివి అంటారే.... అది పెట్టిన రోజు....”

ఇంత చిన్న వయసులో నీకెన్ని అనుభవాలురా నా చిట్టి తండ్రీ అనుకుంటూ గుండెకి హత్తుకుంది.

నానీ అలసటగా ఆమెపై వాలిపోయాడు.

ఎన్ని రోజులైంది.... అమ్మ పోయాక మళ్ళీ యిన్నాళ్ళకి అమ్మను కావలించుకున్నట్టే వుంది..... చేతుల్తో చుట్టేశాడు సొంత అమ్మలాగే.

పొందిన బ్రతుకులో మాధుర్యాన్ని వెదుక్కోవడం లేదు. కాని పోగొట్టుకున్నది ఎంత గొప్ప జీవితమో ఈ క్షణంలోనే తెలుసుకున్నట్టు “నానీ” పిలిచింది గోముగా.

“ఊ” అన్నాడు తలపైకెత్తకుండానే.

“ఎప్పుడూ నా దగ్గరే వుండిపోతావా?”

“ఎందుకూ?”

“మరి నీకు అమ్మ నైపోదామని.”

“మరి తాతయ్యో?”

“మీ తాతయ్యకీ కొడుకుంటాడుగా.”

గొణిగాడు “మంచి కొడుక్కాదుగానీ”

“నీకు రోజూ అమ్మలా గోరుముద్దలు తినిపిస్తాను..... జోలపాడి నిద్రపుచ్చుతాను”

"ఇంకా మంచి మంచి కథలు చెబుతాను.... నేను చచ్చిపోయేదాకా నిన్ను ప్రేమగా.."

అప్పుడు తల పైకెత్తాడు.

కళ్ళలో సుడులుగా తిరుగుతున్న నీళ్ళు.... అమ్మ పోయిం దగ్గర్నుంచి సరిగ్గా అలాంటి ప్రేమకోసమే అంగలార్చుకుపోతున్నాడు....

"చ చ -మంచిబాబు ఏడుస్తాడా...." అమ్మలాగే అంది.

"మరి చచ్చిపోయేదాకా అని ఎందుకన్నావు" చివరిశ్వాస విడిచేటప్పటి అమ్మరూపం గుర్తుకొస్తూంది "అలా అనొచ్చా.... తప్పుకదా"

"తప్పేనమ్మా.... ఇంకెప్పుడూ అనను. సరేనా?"

మంచి బాలుడిలా తలూపి ఆమెను చుట్టుకుపోయాడు.

ఆ రాత్రి అనసూయ పక్కన అమ్మమీదలాగే కాలేసి పడుకున్నాడు.

*　　　　*　　　　*　　　　*

హోటల్ 'పంచవటి' రూం నెంబరు 102లో....

ఉదయం ఆరుగంటల వేళ....

యశస్వి అత్యధిక సర్క్యులేషన్ గల 'అనుదినం' పత్రికని చూస్తున్నాడు రెప్పవాల్చకుండా....

రామసూరి అన్నమాట ప్రకారం పథకం చాలా పకడ్బందీగా అమలు జరిగిపోయింది.

"రాందేవ్ మరణంలో నానీ పాత్ర ఎంత" అన్న హెడ్డింగ్ పెట్టి బాక్సకట్టి ప్రచురింపబడ్డ న్యూస్‌తో బాటు 'కనిపించటం లేదు' అన్న మకుటంతో నానీ ఫోటోకూడా విడిగా పబ్లిషైంది. అదీ తండ్రి చంద్రం పేర్న....

సామాన్యంగా ఇలాంటి ఫోటోలు పబ్లిష్ చేయబడేది దినపత్రిక మూడో పేజీలో అయినా న్యూస్ ఐటమ్‌కి సపోర్టుగా మొదటి పేజిలోనే ప్రచురించే ఏర్పాట్లు చేశాడు రామసూరి.

రామసూరి ఇంటికి ఫోన్ చేశాడు యశస్వి.

రెండు నిముషాల వ్యవధిలో లైనులోకి వచ్చాడు రామసూరి "హల్లో".

"గుడ్ మార్నింగ్..... నేను యశస్విని"

"చెప్పండి" నాలిక తడబడుతూంది.

"మీరు ప్రజెంట్ చేసిన న్యూస్ అద్భుతంగా వుంది."

"థేంక్స్.... కాని ఇంతటితో ఆగిపోదు. ఆగనివ్వను. ఇందులో పోయింది నాకు ప్రియమైన స్నేహితుడు కాబట్టి ప్రతిరోజు ఇదో ఫీచర్‌లా కొనసాగిస్తా.... ఈ వేడి చల్లారకుండా ప్రజల్ని, ప్రభుత్వాన్ని రెచ్చగొడతాను."

"నాకా నమ్మకముంది"

"అప్పుడే చీఫ్ మినిష్టర్ రంగంలోకి దిగాడని-తన పార్టీ పరువుని నాయకత్వాన్ని ప్రజలు శంకించకుండా చర్యల్ని తీసుకోబోతున్నాడనీ తెలిసింది...సో ఇప్పుడు ముఖ్యంగా మనం

చేయాల్సింది....''

"రాందేవ్ కెమెరాలో ఫిల్మ్ రోల్ ఎలా పోయిందో తెలుసుకోవడం....'' "యూ ఆర్ స్పీకింగ్ లైకే పోలీసాఫీసర్''

నవ్వు వినిపించింది.

"అది కాదు మిస్టర్ యశస్వీ.... నానీ ప్రాణాలు ప్రమాదంలో చిక్కుకున్నాయి...''

"ఎలా'' తొట్రుపాటుగా అన్నాడు యశస్వి "నేను డిపార్ట్‌మెంటల్‌గా చేసిన ఎంక్వయిరీనిబట్టి నానీ అప్పారావు దగ్గర లేడు... అర్థరాత్రి వేళ నానీని గదిలోనుంచి ఎవరో ఎత్తుకుపోయారని ముందు జాగ్రత్తగా అప్పారావు పోలీస్ కంప్లెయింటిచ్చాడు.''

"తెలివయిన ఫూల్'' రామసూరి అన్నాడు.

"ఇప్పుడు చెప్పు బ్రదర్.... ఆ ఎత్తుకుపోవడమన్నది రాందేవ్ ఎందుకు చేసుండడు... ఆ విషయం తెల్సుకునే రాందేవ్‌ని ఎందుకు హత్య చేయించి వుండడు... అఫ్‌కోర్స్.... ఇవన్నీ ప్రోబబిలిటీస్‌గా మీ డిపార్టుమెంటుకి అనిపించొచ్చు... బట్... నా అంచనా ప్రకారం ఇవి ఫేక్ట్స్.''

యశస్వి పిడికిలి ఫోన్‌చుట్టూ బిగుసుకుపోయింది.

"మీకు హోం మినిస్టర్ గురించి కొద్దిగా తెలుసు.... కాని నాకు వాడి జాతకం అంతా తెలుసు... చెప్పమంటారా.... వాడో లుచ్చా... పక్కా వుమనైజర్.... డాఫర్ గాడు... ఇంకా చాలా..... తన పదవిని పరపతిని అంత సునాయాసంగా వదలడు.... అవసరమనిపిస్తే హత్యలు చేయిస్తాడు. అవసరం లేకపోయినా అలజడి సృష్టించి ప్రజల దృష్టిని తప్పుదోవ పట్టించగలడు- సో మైడియర్ ఇన్‌స్పెక్టర్! ఇప్పుడు మన ముఖ్య కర్తవ్యం ఆ పసికందును ప్రాణాలతో కాపాడటం.... డౌట్ అనుకోండి.... బట్.....ట్రై చేయాలి. ఏమంటారు-?''.

"రెండోది.... ఆ రాత్రి వాడితో ఎవర్తన్నా వుందేమో తెలుసుకోవడం. ఎందుకంటే నా అంచనా తప్పుకాదు బ్రదర్.... రాందేవ్ అలాంటిదేదో ఫోటోలు తీసుంటాడు. కాబట్టే రీలు పోయింది. నానీని రాందేవ్ తప్పించే ప్రయత్నంలోనే వాళ్లకి చేజిక్కివుంటాడనిపిస్తుంది. కాబట్టి నానీ బ్రతుకుతో ఈ సమస్య మొత్తం ముడిపడుంది'' ఫోన్ పెట్టేసిన చప్పుడు-

కొన్ని క్షణాల క్రితం దాకా వున్న ప్రశాంతత చెదిరిపోయిన యశస్వి రిసీవర్ని క్రెడిల్ చేసి సాలోచనగా పైకి లేస్తూ చూశాడు-

హరిత ఎప్పుడు నిద్ర లేచిందో రెప్పవాల్చకుండా అతడ్ని గమనిస్తూ "ఏమైంది?'' అంది నైటీని సర్దుకుని ముందుకొస్తూ.

"హోం మినిస్టర్ అప్పారావు చుట్టూ ముడులు బిగుసుకుపోయాయి హరితా'' అన్నాడు.

"మంచిదేగా!''

"అనే నేను అనుకున్నాను కాని-'' ఓ క్షణం ఆగి "ఇప్పుడు నానీ మరిన్ని విషమ

పరిస్థితుల్లో చిక్కుకున్నాడనిపిస్తూంది” అన్నాడు.

“అసలు నానీ ఎక్కడున్నాడంటావ్?”